



నారాయణపేట మునిసిపాలిటీ



మహబూబ్‌నగర్‌లోని మినీ శిల్పారామం

శిల్పారామం దుకాణాలపై.. నిరాసక్తి

- 46 దుకాణాలకు ఒక్క దరఖాస్తూ రాలేదు
- ఈనెల 30 వరకు గడువు పొడగింపు
- రూ.3,644 నుంచి రూ.7,511 వరకు అద్దెలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరు నగరంలోని మినీ శిల్పారామంలో మహిళలు తయారు చేసే ఉత్పత్తులతోపాటు వ్యాపారులు తమ వ్యాపారం చేసుకునేందుకు దుకాణాలను కేటాయించాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. అక్కడున్న 46 దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో అధికారులు అవాక్కవ్వాల్సి వచ్చింది. ఈనెల 19 వరకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు, డీడీలు స్వీకరించి 21న బహిరంగ వేలం పాట నిర్వహించాలని నిర్ణయించారు. అందులో 16 దుకాణాలను మహిళా సంఘాలకు కేటాయించారు. 21 దుకాణాలను జనరల్‌కు కేటాయించగా, 1 వికలాంగులకు, 6 ఎస్సీలకు, 2 ఎస్టీలకు కేటాయించారు. వీటి అద్దె నెలకు రూ.3,644 నుంచి రూ.7,511 వరకు నిర్ణయించారు. బహిరంగ వేలంలో ఒక దుకాణానికి ఒకరి కన్నా ఎక్కువ మంది పోటీ పడితే నిర్ణయించిన అద్దె కన్నా ఎక్కువ అద్దె పలకవచ్చు. అయితే 19వ తేదీ వరకు ఒక్క డీడీ కూడా రాకపోవడంతో చేసేది లేక ఈనెల 30 వరకు గడువును పొడిగించారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ముందుగా జనరల్ కేటరిగిలో రూ.25 వేలు, రిజర్వేషన్ దుకాణాలకు రూ.12,500 డీడీలు సమర్పించి, వేలంలో పాల్గొనాలి. దుకాణాలు దక్కించుకున్న వారికి డీడీ డబ్బులు తిరిగి ఇవ్వరు. గడువు పొడిగించడంతో ఇప్పుడైనా వస్తారా?.. లేదా? అని అధికారుల్లో టెన్షన్ నెలకొంది.

పూర్తి స్థాయిలో అభివృద్ధి కాకపోవడంతో..

అధికారులు మినీ శిల్పారామంతోపాటు పక్కనే ఉన్న మినీ ట్యాంక్‌బండ్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది. అప్పుడే ఈ ప్రాంతానికి సందర్శకులు వస్తారు. సందర్శకులు వస్తేనే అక్కడ దుకాణాలలో విక్రయించే ఉత్పత్తులకు డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం ఈ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. శిల్పారామం కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, అక్కడ నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి సందర్శకులకు ఆకర్షిస్తేనే ఈ దుకాణాలకు డిమాండ్ ఉండనుంది. ఆ కారణం చేతనే అక్కడ దుకాణాలను తీసుకునేందుకు మహిళా సంఘాలు, వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దుకాణాల ఏర్పాటు విషయంలోనూ పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. సందర్శకులను ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో సమ్మర్‌లో ప్రజలకు వినోద కార్యక్రమాలను ఏర్పాటుచేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

అన్ని రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు

పాలమూరు నగరంలోని మినీ ట్యాంక్‌బండ్ పక్కనే శిల్పారామం ఏర్పాటు చేశారు. అందులో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు దుకాణాలను సిద్ధం చేశారు. గృహ అలంకరణ వస్తువులు, తినుబండారాలు, పికిల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, హోమ్‌నీడ్స్ ఇలా రకరకాల ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన వెంటనే ఫిబ్రవరి 13, 14, 15, 16 తేదీల్లో మన నగర మహోత్సవం పేరిట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రోజూ వేల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దీంతో శిల్పారామం గురించి ప్రజలు ఓ అంచనాకు రావడంతో చాలా రోజులుగా అక్కడ ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇవ్వాలని నగరపాలిక అధికారులు నిర్ణయించారు. ఈనెలలో ఓ పత్రికలో అందుకు సంబంధించిన ప్రకటన విడుదల చేసి, దరఖాస్తులకు ఈనెల 21 వరకు గడువు విధించారు.



శిల్పారామంలోని దుకాణాలు

మిగిలింది 9 రోజులే..

- అడ్వాన్స్ ఆస్తి పన్ను చెల్లింపునకు ఈ నెల 30 చివరి గడువు
- ముందస్తు చెల్లింపుతో 5 శాతం రాయితీ
- మహబూబ్‌నగర్‌లో రూ.3.08 కోట్లు.. నారాయణపేటలో రూ.32 లక్షలు చెల్లింపు



నారాయణపేట మునిసిపల్ కార్యాలయం

నారాయణపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరాని(2025-26)కి సంబంధించి అడ్వాన్స్ ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పించిన విషయం తెలిసిందే. ఈ నెల 30తో ఆ గడువు ముగియనుండగా, ఇంకా తొమ్మిది రోజులే మిగిలి ఉంది. నారాయణపేట మునిసిపాలిటీలో 9,216 నివాసాలకు గాను ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.5.66 కోట్లు పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా ఉండగా, ఇప్పటి వరకు 1,013 మంది అడ్వాన్స్ పన్ను రూ.32 లక్షలు చెల్లించారు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో 52,886 నివాసాలకు గాను రూ.52.59 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉండగా 7,199 మంది రూ.3.08 కోట్లు చెల్లించారు. ఏడాదిలో రెండు సార్లు అంటే మొదటి అర్ధ సంవత్సరం జూన్ 30 లోపు, రెండో అర్ధ సంవత్సరం డిసెంబరు 31లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే మునిసిపాలిటీలు ఎటువంటి వడ్డీని విధించవు. తెలంగాణ పురపాలక సంఘాల ఆర్ఆర్ చట్టం కింద పన్నుల మొత్తాన్ని రికవరీ చేయడానికి పన్ను ఎగవేతదారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పన్నులను రాబట్టడం కోసం అవసరమైతే కుళాయి కనెక్షన్లు కట్ చేయడంతో పాటు.. డ్రైనేజీ సేవలను నిలిపేస్తారు. పన్నులు సకాలంలో చెల్లించి మునిసిపాలిటీల అభివృద్ధికి తోడ్పాటు నందించాలని అధికార యంత్రాంగం కోరుతోంది.

ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 30 వరకు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. అందుకు పది రోజులే మిగిలి ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- భోగీశ్వర్లు, నారాయణపేట మునిసిపల్ కమిషనర్, నారాయణపేట

మునిసిపాలిటీల వారీగా వసూలు కావాల్సిన పన్ను, ఇప్పటి వరకు వసూలైన వివరాలు(రూ.ల్లో)

మునిసిపాలిటీ	మొత్తం అసిస్మెంట్స్	వసూలు కావాల్సింది	ఇప్పటి వరకు చెల్లించింది
కోస్గి	6,400	2.08 కోట్లు	15 లక్షలు
మక్తల్	7,558	1.99 కోట్లు	14 లక్షలు
నారాయణపేట	9,216	5.66 కోట్లు	32 లక్షలు
మద్దూర్	2,766	26 లక్షలు	76 వేలు
భూత్పూరు	3,591	3.11 కోట్లు	10 లక్షలు
జడ్చర్ల	18,595	6.57 కోట్లు	56 లక్షలు
మహబూబ్‌నగర్	52,886	52.59 కోట్లు	3.08 కోట్లు
పెబ్బేరు	5,244	99 లక్షలు	11 లక్షలు

ఈస్టర్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



ఈస్టర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ వేడుకలను మీ అందరితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని కల్వరి కొండపై క్రైస్తవులు నిర్వహించిన ఈస్టర్ సూర్యోదయ ఆరాధనకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగవంతుడి తత్వాన్ని మనం అర్థం చేసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మత పెద్దలు చెప్పిన సువార్తలోని విషయాలు మనసుకు హత్తుకున్నాయన్నారు. ప్రేమించు, క్షమించు, క్రిస్టియన్‌ను అనుసరించు అను మూడు ప్రధాన సూత్రాలతో నేడు కోట్లాది మంది క్రైస్తవులు జరుపుకునే పండుగనే ఈస్టర్ అని అన్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కల్వరి కొండను దశల వారీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.10.72 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అంతకు ముందు ఎంబీ చర్చి పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్, హైదరాబాద్ నుంచి వచ్చిన మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పాటలను ఆలపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సీజే బెనహర్, పట్టణ అధ్యక్షుడు శ్యామ్యూల్ దాసరి, ఎంబీ చర్చి ప్రతినిధులు జాకోబ్, స్టీఫెన్, ఇమ్మానుయేల్ రాజు, టైటస్ రాజేందర్, బీపీ విక్టర్, దాసరి సుందర్ రావు, కేఆర్ ఫిలిప్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విజేతగా నిలవాలి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్
- మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ మహిళా జట్టు ఎంపిక
6

గాలి వాన బీభత్సం..
- నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఈదురు గాలులతో కురిసిన వాన
- విరిగిన చెట్లు.. దెబ్బతిన్న పంటలు
7

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి
- చిన్నచింతకుంట మండలం ఉంద్యాల శివారులో ఘటన
- ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం
7

బైక్ పేలి యువకుడి మృతి
- మరొకరికి గాయాలు
- రన్నింగ్‌లో ఉండగానే వేడెక్కి పేలిన వాహనం.. చెలరేగిన మంటలు
- వంగూరు గేటు సమీపంలో ఘటన
7

అనువాదం కవి గొప్పతనం

- మూల భాషపై కంటే అనువాద భాషపై పట్టు ఉండాలి
- సొంతూరు, అలివివల పుస్తకాల ఆవిష్కరణలో ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

జడ్చర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తన కవిత్వాన్ని త్యాగం చేసి, మరో కవి రచనలను అనువాదం చేయడం కవి గొప్పతనమేనని ప్రొఫెసర్, పాలమూరు అధయయన వేదిక అధ్యక్షుడు హరగోపాల్ అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని సెమినార్ హాల్‌లో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్చర్ల పట్టణానికి చెందిన ప్రముఖ కవి ఉదయమిత్ర రచించిన అనువాద కవిత్వం సొంతూరు పుస్తకం, అలివివల కథల పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ కవిత్వాలు, రచనలు, కథలు.. సమాజంలో జరుగుతున్న సంఘటనల స్పందనతోనే వస్తాయన్నారు. అనువాదం చేయడమంటేనే తనకు తాను త్యాగం చేయడమేనన్నారు. ఒక సాహిత్యకారుడిగా ఉదయమిత్ర రచనలు సమాజంపై లోతైన ప్రభావం చూపుతాయన్నారు. వివిధ దేశాలకు చెందిన 58 మంది కవులు రాసిన అనుభవాలన్నీ ఒకేలా ఉన్నాయని.. దేశ, దేశాల కవిత్వాన్ని సొంతూరు పుస్తకంలో అనువదించారని చెప్పారు. సొంతూరు పుస్తకంపై అర్పిణి రాజేంద్రబాబు, పుప్పాల శ్రీరామ్, సతీష్‌బైరెడ్డిలు, అలివివల కథల పుస్తకంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సుభాషిణి, నారాయణ పరిచయాలు చేశారు. ఉదయమిత్ర రచించిన రెండు పుస్తకాలపై పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, వెంకట్రాములు, జనజ్వాల, చాంద్‌ఖాన్, శ్రీదేవి, ఖలీల్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్‌లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్, నయీమొద్దీన్, నర్సిములు, విశ్వనాథం, నిరంజన్, వల్లభాపురం జనార్దన, లక్ష్మణ్‌గౌడ్, ఖాజామైనొద్దీన్, తెలుగు సత్తయ్య, జగన్‌ల పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి
- ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి
- విగ్రహావిష్కరణలో ఎంపీ డీకే అరుణ
6

ఆటో, టిప్పర్ ఢీకొని ఒకరి మృతి
6



తవ్వకాలలో వెలువడిన ఇనుప శిథిలాలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ముగిసిన అన్వేషణ

- లభించని ఆరుగురి కార్మికుల ఆచూకీ
- షీర్ జోన్‌లో తవ్వకాలు అసాధ్యమేనా?
- టెక్నికల్ కమిటీ భేటీ తర్వాతే తుది నిర్ణయం
- బయటకు తరలిస్తున్న ఇనుప శిథిలాలు

దోమలపెంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన జరిగి ఆదివారానికి 58 రోజులు అయ్యింది. సొరంగ ప్రమాదంలో శిథిలాల కింద చిక్కుకున్న ఆరుగురి కార్మికుల జాడ కోసం రెస్క్యూ బృందాలు తవ్వకాలు జరుపుతూ అన్వేషణ కొనసాగించాయి. అత్యంత ప్రమాదకరంగా ఉన్న 43 మీటర్లు మినహా మిగతా ప్రాంతం అంతా తవ్వకాలు జరుపుతూ శిథిలాలను ఇప్పటికే తిరగతోడారు. అణువణువునా జల్లెడ పట్టినా

(మిగతా 6లో..)

61 మంది హోంగార్డుల బదిలీ

- నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్‌కు..
- వారి స్థానంలో మహబూబ్‌నగర్ నుంచి అంతే మంది నారాయణపేట జిల్లాకు..
- ఇన్‌చార్జి అధికారి ఆర్ఎస్ఐ మద్దయ్య

నారాయణపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో ఆరేళ్లుగా పని చేసిన 61 మంది హోం గార్డులు మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. వారికి ఇన్‌చార్జి అధికారి ఆర్ఎస్ఐ మద్దయ్య ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దయ్య మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేసి, మంచి పేరు తేవాలన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా బాగా పని చేసి, కుటుంబాన్ని బాగా చూసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ స్వస్థలం అయి ఉండి, ఇన్ని రోజులు ఇక్కడ పని చేసిన హోంగార్డులు ఎస్పీ యోగేష్ గౌతమ్ చొరవతో సొంత జిల్లాకు బదిలీపై వెళ్తున్నారన్నారు. వారి స్థానంలో మహబూబ్‌నగర్ నుంచి 61 మంది పేట జిల్లాకు వస్తారన్నారు.

విజేతగా నిలవాలి

● ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్

● మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ మహిళా జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా మహిళా జట్టుతో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మందమర్రి సింగరేణి హైస్కూల్‌లో ఈనెల 29, 30న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళా జట్టును ఆదివారం స్థానిక స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్, తెలంగాణ పీడీ, పీఈటీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నింజన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులు కొదవలేదని, ఎంతో మంది జాతీయ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. క్రీడ కోటాలో ఉద్యోగ అవకాశలు లభిస్తాయన్నారు. ఉమ్మడి జిల్లా మహిళా జట్టుకు రోజ, శివానిచంద్ర, భార్గవి, భవాని, సౌమ్య, ఇర్ఫామహేక్, రుచిత, నందిని, బిందుప్రియా, హిమబిందు, నాగవైష్ణవి, సుమతి, అంకిత, రిషిత, నిఖిత, సౌజన్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ శంకర్‌నాయక్, సీనియర్ క్రీడాకారులు అభిలాష్, శివకుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తెలంగాణ పీడీ, పీఈటీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్

'మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి'



ఆందోళన చేస్తున్న మహిళా, ప్రజా సంఘాల నాయకులు

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీ లను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి డిమాండ్ చేశారు. పోటీలను వ్యతిరేకిస్తూ ఆదివారం పీవోడబ్ల్యూ, ఐద్వా, పీవైఎల్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మునిసిపల్ పార్కు వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. 120 దేశాల నుంచి మహిళా ప్రతినిధులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఇది గర్వించదగ్గ విషయం కాదన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వాటిని నెరవేర్చకుండా, ఈ పోటీలకు రూ.వందల కోట్లు ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ పోటీలోని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతాప్, సాయికుమార్, నరహరి, సౌజన్య, లక్ష్మి, సమ్రిన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

● హైదరాబాద్‌లోని రాంనగర్ నివాసం ఉంటున్న గుండుమాల్‌కు చెందిన రాజేశ్

● ప్రేమ విఫలం కావడంతో హోటల్ రూమ్‌లో అఘాయిత్యం



రాజేశ్(ఫైల్)

కోస్గి రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాజేశ్(22) హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. కుమ్మరి రాజేశ్ హైదరాబాద్‌లోని రాంనగర్ నివాసం ఉంటూ ప్రైవేటు జాబ్ చేస్తూ పీజీ ఎంట్రెన్స్‌కు సిద్ధమవుతున్నారు. ప్రేమ విఫలం కావడంతో రాంనగర్‌లోని ఓ హోటల్ రూమ్‌లో ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని షాషాబ్‌గుట్టకు చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. షాషాబ్‌గుట్టకు చెందిన ముక్తార్ బేగ్ (56) ఎలక్ట్రిసిటీలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో మెట్టుగడ్డ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా టంకరకు చెందిన శ్రీరామ్ యమహా వాహనంపై నిర్లక్ష్యంగా అతివేగంగా ముక్తార్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన ముక్తార్‌ను చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుల్తాన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకు సుపారీపై కలకలం

దేవరకద్ర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి హత్యకు సుపారీ మాట్లాడినట్లు ఓ ఆడియో రెండు రోజుల నుంచి వైరల్‌గా మారడంతో ప్రశాంతంగా ఉన్న దేవరకద్రలో ఒక్కసారిగా కలకలం రేగింది. తొమ్మిదేళ్ల క్రితం దేవరకద్రలో హత్య జరిగింది. అప్పటి నుంచి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. ప్రస్తుతం ఆడియో వైరల్‌గా మారడంతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. దీంతో ప్రశాంత్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందుతులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పాత కక్షల నేపథ్యంలోనే సుపారి మాట్లాడిన కోణంలో పోలీసులు విచారణ చేపటినట్లు సమాచారం. ఈ క్రమంలో దేవరకద్రలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

ఆటో, టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

మహ్మదాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహబూబ్‌నగర్ - చించోలి రహదారిపై ఆదివారం సాయంత్రం నంచర్ల గేటు వద్ద జరిగిన టిప్పర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ కాట్రావత్ సునిల్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. హన్వాడ మండలం ఎల్లంబావితండాకు చెందిన సునిల్ ఆటో నడపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఆటోలో వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

» ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

» గుడిగండ్లలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని గుడిగండ్ల గ్రామంలో హనుమంతు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఈవో లక్ష్మినారాయణ రాసిన తెలుగు అనువాద రాజ్యాంగ ప్రతిని ఎమ్మెల్యేకు కానుకగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, రాజులఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, చిన్న హనుమంతు, మహేశ్వరి పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

● ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో ఎంపీ డీకే అరుణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

రాజాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని ప్రజలందరూ కాపాడుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదిపరాశ్రీ స్వామితో కలిసి ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఛావా సినిమాను చూడాలని సూచించారు. దేశంలో హిందూ ధర్మం ఉండాలంటే ప్రతీ ఒక్కరు దాని ప్రతిష్ఠ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత దొండ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు చించోడ్ అభిమన్యురెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, దుశ్యంత్ రెడ్డి, నర్సిములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



26 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం పాఠశాలలో 1998-99 టెన్త్ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరానికి స్పందన

వంగూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి భారీ స్పందన వస్తోంది. గ్రామస్థులతో పాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. కొండారెడ్డిపల్లిలో హైదరాబాద్‌లోని శంకర నేత్రాలయ, ఎనుముల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం కొనసాగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 30 మంది కంటి శుక్లం ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్లకు రెఫర్ చేసినట్లు మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి తెలిపారు. 100 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎనుముల రాజశేఖర్‌రెడ్డి, వంశీ, బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతను ఈ ఆదివారం భక్తులు అత్యధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 15వేల మందికి పైగా భక్తులు దేవతను దర్శించుకొని పూజలు చేశారు. భక్తుల నుంచి హుండీ ద్వారా రూ.1,01,537, టికెట్ల ద్వారా రూ.38,290, ఇలా మొత్తం రూ. లక్షా 39వేల 827 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ముగిసిన అన్వేషణ

» లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ

» షీర్ జోన్‌లో తవ్వకాలు అసాధ్యమేనా?

» టెక్నికల్ కమిటీ భేటీ తర్వాతే తుది నిర్ణయం

» బయటకు తరలిస్తున్న ఇనుప శిథిలాలు



సొరంగంలో అడుగు భాగంలో ఉన్న ఇనుప రేకులను తొలగిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

(5వ పేజీ తరువాయి...)

ఆ ఆరుగురు కార్మికుల జాడ దొరుకలేదు. డీ1 ప్రాంతంలో తవ్వకాలలో బయట పడిన టీబీఎం ప్లాట్‌ఫాంకు సంబంధించిన ఇనుప శకలాలను వెలుపడిన బండ రాళ్లను, నీటి ఊటను ఎప్పటికప్పుడు బయటకు పంపింగ్ చేస్తున్నారు. అక్కడక్కడ మిగిలిన మట్టి దిబ్బలను, బురదను బయటకు తరలిస్తున్నారు. సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జేపీ కంపెనీ, ర్యాట్ హోల్ మైనర్స్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టెక్నికల్ కమిటీ అధ్యయనం తర్వాతే తుది నిర్ణయమా..?

సొరంగంలో 14వ కిలోమీటర్ల దగ్గర కూలిన శిథిలాల ప్రాంతంలో భారీగా నీటి ఊట ఉబికి వస్తుండటం, శిథిలాలు కూలిపడిన చోట టీబీఎం చిక్కుకున్న ఏరియా మరో సొరంగం మాదిరిగా గండి పడి ఉన్నట్లు గతంలో జీఎస్ఐ సర్వే అధికారులు పేర్కొన్నారు. 13.500 కిలో మీటర్ల నుంచి 15వ కిలో మీటర్ వరకు భూభాగంలో పొరల మధ్యన మట్టి, కొండ రాళ్లు, పారే జలపాతం లాంటి నీటి ఊట ఉన్నట్లు ప్రమాద ఘటన తరువాత ఎన్‌సీఎస్ గతంలో రిపోర్టు చేశారు.

ఇక ముందుకు పనులు ముందుకు సాగడం కష్టసాధ్యమని రెస్క్యూ బృందాల అధికారులు పేర్కొంటున్నారు. సొరంగంలో ఉన్న ప్రమాద పరిస్థితులను అంచనా వేసేందుకు ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీ ఈ నెల 24 లోపల ఎస్ఎల్‌బీసీ సొరంగం లోపల పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాతే సొరంగం పనులు చేపట్టేందుకు ప్రణాళిక రుపొందిస్తారని సమాచారం.



సొరంగంలో టీబీఎం ఫ్లాట్ ఫాంను కత్తిరిస్తున్న రెస్క్యూ సిబ్బంది

పాన్‌గల్‌లో నలుగురి అదృశ్యం



పరమేశ్ (ఫైల్)

పాన్‌గల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో నలుగురు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండలంలోని కొత్తపేటకి చెందిన జ్యోతి పరమేశ్‌లు భార్యాభర్తలు. వీరిద్దరికి 17 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పరమేశ్ పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు సంవత్సరాల కిందట ప్రమాదవశాత్తు కుడి కన్ను పోయింది. అప్పటి నుంచి మతిస్థిమితం లేక ఇంట్లో నుంచి వెళ్లి నెలకు ఒకసారి ఇంటికి వస్తుపోతూ ఉండేవారు. జనవరి 20న కలర్లు తీసుకొస్తామని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు రాలేదు. తన భర్త పరమేశ్ ఆచూకీ దొరికేలా చూడాలని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదేవిధంగా తల్లీ ఇద్దరు కుమారులు మిస్సింగ్ కేసు నమోదైన సంఘటన చోటు చేసుకుంది. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఉల్లంకొండ స్వామికి వీపనగండ్ల మండలానికి చెందిన చెన్నమ్మతో 13 సంవత్సరాల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు బాలురు, బాలిక ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. వారిద్దరూ గొడవ పడిన ప్రతీసారి ఆమె తల్లి గారి ఇంటికి వెళ్లి వచ్చేది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటికి తాళం వేసి చిన్నమ్మతో పాటు ఇద్దరు కుమారులను తీసుకొని వెళ్లింది. ఆమెకు ఫోన్ చేస్తే సమాధానం లేదు. భర్త స్వామి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'లబ్ధిదారుల జాబితాను మంత్రి జూపల్లి ప్రకటించాలి'

కొల్లాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపాలిటీలోని చుక్కాయిపల్లి గ్రామ పరిధిలోని రెండు, మూడు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో మం త్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకోవాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ఆదివారం ప్రకటనలో కోరారు. కొందరు పైరవీకారులు పెత్తనం చెలా యిస్తున్నారని, గతంలో ఇదే చుక్కాయిపల్లి గ్రా మంలో ప్రభుత్వ నివాస గృహాల్లో చాలా పెద్ద స్కాం జరిగిందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచు కుని స్వయంగా మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చి గుడిసెలు ఉన్న వాళ్లకి కనీసం భూమి లేని వారికి ఫస్ట్ విడతలో రెండు వార్డులు కలి పి 40 ఇళ్లు మంజూరు అయ్యాయని, వాటిని స్వయంగా మంత్రి పర్యవేక్షణ చేసి, నిజమైన లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన కోరారు. కొందరు ఇళ్ల పేరుతో, ఆధార్, ఫొటోలు అంటూ హంగామా చేస్తున్నారని, మంత్రి పరిశీలించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



తట్టు సంచులను ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌భూతం నుంచి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరి బాధ్యత అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ కోట్ల రవి చేయించిన తట్టు సంచులను చిన్నారెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి కాలంలో ప్లాస్టిక్ వాడకం అధికమై పర్యావరణం పూర్తిగా వినాశనానికి గురవుతుందని అన్నారు. ఈ తరుణంలో తట్టు సంచులను వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచన ప్రతీ ఒక్కరిలో రావాలని కోరారు. రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, ఎండీ బాబా, పెంటన్న యాదవ్, అబ్దుల్లా, ద్యారపోగు విజయ్‌బాబు, జానంపేట నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జున, ఈశ్వర్‌రెడ్డి, గడ్డం వినోద్, రషీద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



బుచ్చన్న (ఫైల్)

పెబ్బేరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గంగిరెడ్డి యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిసి పాలిటీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన రైతు వైనమోని బుచ్చన్న(65) శనివారం మధ్యాహ్నం గొర్రెలకు పచ్చిగడ్డి తేవడానికి వెళ్లాడు. ఇంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల పంటపొలాలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పెబ్బేరు సమీపంలోని కారుపాకుల కృష్ణయ్య బావిలో బుచ్చన్న మృతదేహం కనిపించింది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బావిలో నుంచి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమితం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలంలోని ఈర్లదిన్నెలో శనివారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు కంట పడ్డాయి. వాటిని నిలిపి ప్రభుత్వ అనుమతులు కోరగా.. ఎలాంటి అనుమతులు చూపకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ ఓనర్స్ డ్రైవర్లు బొల్లు బాలరాజు, నక్కల రవీందర్, గాలెన్న ఈర్ల శేఖర్, మండ్ల రాకేష్, మహేష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ పేలి యువకుడి మృతి



రోడ్డుపై దగ్ధమైన బైక్

వంగూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వంగూరు గేటు సమీపంలో ఆదివారం ఉదయం హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో ప్రమాదవశాత్తు బైక్ పేలి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ కథనం ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన జునేద్, ఇమ్రాల్ ఇద్దరు మిత్రులు కలిసి హైదరాబాద్ నుంచి బైక్‌పై డిండికి వస్తుండగా వంగూరు గేటు సమీపానికి రాగానే సడన్‌గా బైక్ హీటెక్కి పేలింది. పెద్దగా మంటలు రావడంతో వారు రన్నింగ్‌లో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో జునేద్(27) తలకు బలంగా దెబ్బతగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ ఇమ్రాల్‌ను 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం మేరకు ఎస్‌ఐ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిన్నచింతకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా, ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల గ్రామ శివారులో చోటుచేసుకుంది. చిన్నచింతకుంట ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని పచైకుంట గ్రామానికి చెందిన ఊట్కూరు ఆశప్ప(55) అనే వ్యక్తి ఉంద్యాల గ్రామంలోని తమ బంధువుల ఇంటికి ఫంక్షన్ నిమిత్తం వచ్చాడు. అయితే తిరుగు ప్రయాణంలో తన సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గ్రామస్థులు మృతుడి కుమారుడైన శ్రీనివాసులకు సమాచారం అందించారు. జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూత్పూర్ సంతలో

ఎండు మిర్చికి భలే గిరాకీ!

● సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనేందుకు ప్రజల ఆసక్తి



ఎండు మిర్చి కొంటున్న ప్రజలు

భూత్పూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ఆదివారం సంత జరుగుతున్నది. అయితే ఈ సంతలో ఎండుమిర్చి చాలా ఫేమస్ అని చెప్పవచ్చు. ఎందుకంటే చాలా దూర ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి (రైతులు) నేరుగా తక్కువ ధరకు, మంచి నాణ్యమైన ఎండుమిర్చిని అమ్ముతుంటారు. అయితే ఇక్కడ మిర్చి కొనడానికి మహబూబ్‌నగర్ జిల్లా నలు మూలల నుంచి ప్రజలు వస్తుంటారు.

మిర్చి పండించిన రైతులే వచ్చి తక్కువ ధరకు అమ్మడంతో చాలా మంది ప్రతీ ఆదివారం భూత్పూర్ సంతకు ఎండు మిరపకాయలు కొనడానికి వస్తుంటారు. కిలో ఎండుమిర్చి రూ. 100నుంచి 150వరకు అమ్ముతారు. అదే దళారుల వద్ద అయితే కిలో మిర్చి రూ. 180 నుంచి 270 వరకు అమ్ముతారు. సంత రోజు కాకుండా మిగిలిన రోజుల్లో ఇక్కడ ఉంటే సాధారణ దుకాణదారులు మిర్చిని రెట్టింపు ధరలకు అమ్ముతుంటారు. అదే సంతరోజు అయితే నేరుగా రైతు వద్ద తక్కువ ధరకు మంచి నాణ్యమైన మిరపకాయలు దొరుకుతుండటంతో ఆదివారం సంత రోజు ఇక్కడ మిర్చి అమ్మడానికి గద్వాల, మంగనూరు, బిజినేపల్లి, మిడ్జిల్, నాగకర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట వంటి ప్రాంతాలను నుంచి రైతులు వస్తుంటారు.

ప్రతీ ఆదివారం సుమారు వెయ్యి కిలోల ఎండుమిర్చి అమ్ముడుపోతుంది. వట్టి మిర్చిలో సన్నరకం, దొడ్డు రకం అనేవి రెండు ఉంటాయి. సన్న రకం మిర్చికి కిలో రూ.190 నుంచి 250వరకు ఉంటుంది. అదే దొడ్డురకం అయితే కిలో రూ.100నుంచి 170వరకు ధర పలుకుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారు ఎండుమిర్చి కొనుగోలు చేయడానికి వందల సంఖ్యలో వస్తుంటారు. ప్రతీసారి ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారం వరకు ఎండుమిర్చికి ఈ సంతలో మంచి గిరాకీ ఉంటుంది.



మిర్చి కొనేందుకు భూత్పూర్ సంతకు వచ్చిన ప్రజలు

గాలివాన బీభత్సం

▸ కల్లాల్లో తడిసి ముద్దయిన పంట దిగుబడులు
▸ నేలవాలిన వరి, మొక్కజొన్న తదితర పంటలు
▸ ఒరిగిన విద్యుత్ స్తంభాలు ▸ విరిగిపడిన చెట్లు

● ఈదురు గాలులు.. మోస్తరు వర్షం

ఈదురుగాలులు ఒక్కసారిగా భయానక వాతావరణాన్ని సృష్టించాయి. వీచిన గాలులు, మెరుపులతో కూడిన వర్షం పంటలను, దిగుబడులను దెబ్బతీశాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలగా, చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆదివారం నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం రైతులకు నష్టాలు మిగిల్చింది.



తాడూరులో పసరు వడ్లు పడుతున్న సమయంలోనే ఈదురుగాలులతో నేలకొరిగిన పంటను చూపుతున్న బాల వెంకటయ్య

నాగర్‌కర్నూల్ టౌన్/ తాడూరు/ బిజినేపల్లి/ చారకొండ/తెలకపల్లి/ అమ్రాబాద్/వెల్దండ/ కొత్తకోట/మానవపాడు/పెద్దమందడి/ఊర్కొండ/ వీపనగండ్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం భారీ ఈదురు గాలులతో



పెద్దమందడి మండలం దొడగుంటపల్లిలో అకాల వర్షాలకు వరి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు

కూడిన వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న ధాన్యం తడిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఎండలు దంచికొట్టగా మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఈదురు గాలులు మొదలై అరగంట పాటు మోస్తరు వర్షంతో దట్టంగా వీచాయి. అనంతరం సాయంత్రం వరకు స్వల్ప చిరుజల్లులు కురిశాయి. వర్షానికి పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ, రాంనగర్‌కాలనీ, సంతబజారు, శ్రీపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగిపడగా విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడింది.

● భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో తాడూరు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం 3గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ ఎత్తున ఈదురుగాలులు రావడంతో మొక్కజొన్న పంట, వరి పంటతో పాటు మరీ ఇతరత్రా పంటలు కొన్ని నేలకొరిగాయి. అదేవిధంగా పంటలు కోసుకున్న మొక్కజొన్న, వరిని రైతులు నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై ఆరబోసుకోవడంతో ఆకస్మాత్తుగా వచ్చిన వర్షంతో పూర్తిగా తడిసి ముద్దయింది. పొలాల్లో ఉండే పశువుల పాకకు సంబంధించిన రేకుల షెడ్లు, ఇళ్లపై కప్పు రేకులు ఈ ఈదురుగాలుల కారణంగా ఎగిరి కింద పడిపోయాయి.

● బిజినేపల్లి మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం అపార నష్టం మిగిల్చింది. బిజినేపల్లి, పాలెం, ఖానాపూర్, గుడ్లనర్వ, కారుకొండ, వట్టెం తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు పాలెం నుంచి ఖానాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై చెట్లు కూలిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రకుంట తండా, లట్టుపల్లి, గంగారం, వెల్గొండ తదితర గ్రామాల్లో చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాలెంలోని పద్మావతి కాలనీలో ఈదురు గాలులకు రేకుల డబ్బా ఎగిరిపోయింది. డబ్బాలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శాయిన్‌పల్లి, మమ్మాయిపల్లి గ్రామాల్లో వర్షానికి చెట్లు విరిగిపడ్డాయి.

● చారకొండ మండలంలోని చారకొండ, మర్రిపల్లి, శాంతిగుడెం, బోడబండతండా, సిరసనగండ్ల తదితర గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మర్రిపల్లి గ్రామానికి చెందిన బిట్ల ధర్మారెడ్డి ఎకరం వరిపంట పూర్తిగా నేలకొరిగింది.

● ఆదివారం సాయంత్రం కురిసిన వర్షాలకు తెలకపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో కే తిరుపతిరెడ్డి అనే రైతుతో పాటు కొంతమంది రైతులు మొక్కజొన్నలు, వరి ఆరబోయగా తడిసి ముద్దయ్యాయి. చిన్నముద్దునూర్‌లో రవీందర్‌గౌడ్ మొక్కజొన్న చేను నేలపాలు కాగా ఆరబోసిన మొక్కజొన్న వర్షానికి తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

● అమ్రాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం భీకరంగా వీచిన ఈదురు గాలుల మూలంగా అమ్రాబాద్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇళ్ల ముందు ఉన్నరేకుల గాలికి ఎంతో దూరంలో పడిపోయాయి. మన్ననూర్ నుంచి కుమ్మరోనిపల్లి వరకు అచ్చంపేట-



అమ్రాబాద్ మండల కేంద్రంలోని వేంకటేశ్వర రైస్ మిల్లు వద్ద కూలిన విద్యుత్ స్తంభాలు



తెలకపల్లి మండలం చిన్నముద్దునూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట



మాధారంలో వడగండ్ల వానకు నేలకు ఒరిగిన మొక్కజొన్న చేను

మద్దిమడుగు ప్రధానరహదారిపై చెట్లు కూలడంతో ఆర్టీసీ బస్సులతో పాటు వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాన్స్‌కో ఏఈ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి

● వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలోని రోడ్డుపై గండికోట శ్రీను అనే రైతు ఆరబోసిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోయింది. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో గాలి దుమారంతో మామిడికాయలు రాలాయి.

● కొత్తకోటలో అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. ఇక పక్షం రోజులైతే పంట ఇంటికి చేరుతాయని లోపల ఆనందపడ్డారు. కొందరు కోతలు ప్రారంభించి ధాన్యం కల్లాల్లో ఆరబెట్టి అమ్మకానికి సిద్ధం చేయగా, మరికొందరు పంటలు కోతకు వచ్చాయి. ఈ తరుణంలో అకాల వర్షాలు కింటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

● జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెట్లు విరిగి ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో మిర్చి, పొగాకు రైతులు కష్టాలు పడ్డారు. కల్లాల్లోని మిర్చి, పంట పొలాల్లో ఉన్న పొగాకును కాపాడుకునేందుకు తట్లు ముసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

● ఈదురు గాలులు భారీ వర్షాలతో పెద్దమందడి మండల పరిధిలోని దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లి, బలిజపల్లి, అల్వాల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదోనని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అకాల వర్షంతో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో భారీ తాటి చెట్టు 33 కేవీ విద్యుత్ లైన్‌పై పడటంతో విద్యుత్ వైరు తెగిపోయి స్తంభం నేలపై పడిపోయింది. ఆ సమయంలోఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

● ఊర్కొండ మండలంలోని మాధారం గ్రామంలో వడగండ్లతో కూడిన భారీ వర్షం ఆదివారం సాయంత్రం కురిసింది. వడగండ్లతో కూడిన భారీ వర్షం కురువడంతో మొక్కజొన్న, వరి చేలు భారీగా దెబ్బతిన్నాయి. రైతుల పంటలు దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు.

● మామిడి పంట కోతలు జరుగుతున్న సమయంలో భారీ గాలి మామిడి రైతుకు కన్నీరు మిగిల్చింది. వీపనగండ్లలో కొద్దిపాటిగా కాసిన మామిడి కాయలు ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలులకు నేలరాలాయి. మామిడి కాపు లేక పెట్టుబడులు కూడా రావని ఆందోళన చెందుతున్న రైతులకు గాలి రావడంతో కాయలు పూర్తి స్థాయిలో రాలి భారీ నష్టాన్ని మిగిల్చాయని రైతులు గుండెలు బాదుకుంటున్నారు.



భారీ గాలులకు వీపనగండ్లలో నేలరాలిన మామిడికాయలు

పిడుగు పడి గొర్రెలు మృతి

గోపాల్‌పేట/మల్దకల్, (ఆంధ్రజ్యోతి): పిడుగు పడి గొర్రెలు మృతి చెంది ఇద్దరు గాయాల పాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మండల విశ్వనాథం, చాకలిపల్లి గ్రామానికి చెందిన బోయ రాములు ఇద్దరు కలిసి గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాల్లోకి గొర్రెల మేతకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో వర్షంతో పాటు భారీ ఈదురుగాలులతో పిడుగు పడింది. వర్షం పడుతుందని గొర్రెలను చెట్టు కిందకు తోలారు. రాములు, విశ్వనాథం మరో చెట్టు కింద నిల్చున్నారు. దీంతో ఒక్కసారిగా పిడుగు పడి 25 గొర్రెలు మృతి చెందాయి. పక్కనే ఉన్న విశ్వనాథ రాములు గాయాలతో కింద పడిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. వీటి విలువ రెండు లక్షల 50వేల పైన ఉంటుందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఇటు ఈదురుగాలులతో మండల కేంద్రంలోని హైమాస్ట్ స్తంభం నేలకొరిగింది.



గోపాల్‌పేట మండలం లక్ష్మీదేవిపల్లిలో మృతి చెందిన గొర్రెలు

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల చిప్పదొడ్డి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరు ములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. గ్రామంలో రైతు రామన్‌గౌడ్‌కు చెందిన పొలం వద్ద ఉన్న ఎద్దులు పిడుగుపాటుకు మృతి చెందాయి.

వీటి విలువ సుమారు లక్షా 50వేలు ఉంటుందని రైతు తెలిపారు. అధికారులు నివేదికను పంపి ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

పొగాకు రైతులకు భారీ నష్టం

అలంపూరు, (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పొగాకు రైతుల కు భారీ నష్టం వాటిల్లింది. అలంపూరు మండలంలో బీడీ, సిగరేట్, తలమారి, సిరి వంటి పొగాకు పంటలను పలు ప్రైవేటు కంపెనీలు సాగు చేయించి.. చివరికి ఇప్పుడు కొనకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఈ భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ప్రైవేటు యాజమాన్యాలు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



భారీ వర్షానికి తడిసిన పొగాకు షెడ్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైభవంగా రథోత్సవం



ఆలయంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ దత్త పీఠం శ్రీ దత్తాత్రేయ శ్రీరామధూత శ్రీలక్ష్మి నరసింహ స్వామి యోగానంద సద్గురు స్వాముల వారి సప్తాహ సహిత ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆలయం ఆవరణంలో శనివారం అర్ధరాత్రి నిర్వహించిన రథోత్సవం కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, బంతిపూలతో అందంగా అలంకరించారు. ఆలయం శోభ ఉట్టిపడే విధంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి అనంతరం ప్రారంభమైన రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. యోగానంద స్వాముల వారి ఉత్సవ విగ్రహం, స్వామి వారి పాదుకలను మంగళ వాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఊరేగించారు. రథంలో ప్రతిష్ఠించి, తేరు ముందు అన్నంతో కుంభరాశులు పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ప్రతాన్ని లాగానికి ఆసక్తిని కనబరిచారు. ఆలయంలో భక్తులు అఖండ భజనలు నిర్వహించారు. మహిళలు బొడ్డెమ్మలు, ప్రత్యేక ఆటలు, టపాకాయల శబ్దాలతో ఆలయం ఆవరణం సందడిగా మారింది. స్వామి వారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చివరి రోజు కోనేరులో స్వామి వారి విగ్రహాలకు చక్రస్నానం నిర్వహించారు. భక్తులు లక్ష్మి నరసింహ యోగానంద స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ఉత్సవాలలో చివరి ఘట్టం చక్రస్నానాన్ని వీక్షించడానికి పరిసర గ్రామాల భక్తులు వందలాదిగా తరలివచ్చారు. చక్రతీర్థంను పూజారులు భక్తులకు అందజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో

గద్వాల విద్యార్థుల ప్రతిభ



అక్షర



అభిజిత్ ధోత్రే

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం విడుదలైన జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్)మెయిన్స్-2025లో గద్వాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన సంధ్య, రామ్మోహన్‌రెడ్డి దంపతుల కుమార్తె అక్షర 99.90 పర్సంటైల్‌తో జాతీయ స్థాయి కామన్ ర్యాంక్ లిస్టులో 1,646 ర్యాంకు సాధించింది. ఈడబ్ల్యూఎస్ జనరల్ కెటగిరీలో జాతీయ స్థాయిలో 135 ర్యాంకు సాధించింది. అదే విధంగా గద్వాలలోని వేదనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధోత్రే మహేష్, బాలిక దంపతుల కొడుకు అభిజిత్ ధోత్రే జాతీయ స్థాయి కామన్ ర్యాంక్ లిస్టులో 99.69 పర్సంటైల్‌తో 4,842 ర్యాంకు సాధించాడు. ఓబీసీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 983 ర్యాంకు సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన ఇద్దరు విద్యార్థులను వారి తల్లిదండ్రులతో పాటు, స్థానికులు అభినందించారు.

మిషన్ ఇంద్రధనుస్సు

● నేటి నుంచే జిల్లాలో ప్రత్యేక ఇమ్యూనైజేషన్
● 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణులకు టీకాలు



చిన్నారికి టీకా ఇస్తున్న వైద్య సిబ్బంది

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిషన్ ఇంద్రధనుస్సు పేరుతో గర్భిణులకు, చిన్నారులకు టీకాలు అందించే కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కాబోతుంది. అందుకోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు టీకాలు ఎంతో అవసరం, ముఖ్యం కూడా. అలాగే గర్భిణులు సుఖ ప్రసవం జరిగేందుకు, శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన టీకాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన తరువాత శిశువుకు అవసరమయ్యే టీకాలు ఇస్తూనే ఉంటారు. ఏదైన సందర్భంలో టీకాలు ఇవ్వని కారణంగా మిగిలిపోయే శిశువుకు, తప్పిపోయిన చిన్నారులకు, గర్భిణులకు టీకాలు అందించేందుకు జిల్లా వైద్య యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి టీకాలు అందించేందుకే మిషన్ ఇంద్రధనుస్సును సోమవారం నిర్వహించనున్నారు.

● 0-5 సంవత్సరాల పిల్లలకు...

అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు టీకాలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 826 మందిని గుర్తించారు. అవసరమైతే వీరి సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంటుంది. వీరితో పాటు 217 మంది గర్భిణులకు కూడా టీకాలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 21 నుంచి 26 వరకు మొదటి విడతలో ఏడు రోజుల పాటు టీకీకరణ కార్యక్రమం నిర్వహించి, రెండో దశ మే 21 నుంచి 28 వరకు, మూడో దశ జూన్ 23 నుంచి 30 తేదీ వరకు జిల్లాలో తప్పిపోయిన చిన్నారులకు, అవసరమైన గర్భిణులకు బీసీజీ, ఓపీవీ, హెపటైటీస్-బీ, పెంటా-ఏ, రోటావైరస్, ఎస్‌పీవీ, పీసీవీ, ఎంఆర్-1, ఎంఆర్-2, డీపీటీ వంటి 12 రకాల రోగనిరోధక శక్తి కలిగిన టీకాలు అందిస్తారు.

● 441 క్యాంపుల ఏర్పాటు

జిల్లాలో టీకీకరణ నిర్వహించేందుకు 441 సెషన్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 13 పీహెచ్‌సీలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఒక పీపీ యూనిట్‌తో కలిసి మొత్తం 16 సెంటర్లలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి టీకాలు అందించనున్నారు. అంతేకాకుండా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి గుర్తించిన చిన్నారులకు, గర్భిణులకు టీకాలు అందించడమే కాకుండా స్థానిక నాయకుల సహకారంతో టీకాల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తారు.

● టీకాలు తీసుకోవాలి

జిల్లాలో గుర్తించబడిన ప్రతీ ఒక్క లబ్ధిదారుడు టీకాలు తప్పని సరిగా తీసుకోవాలి. సరైన సమయంలో టీకాలు తీసుకోవడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్త పెరగడమే కాకుండా కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. గర్భిణులు టీకాలు తీసుకోవడం వల్ల సాధారణ సుఖ ప్రసవం జరిగే వీలుంటుంది. జిల్లా వ్యాప్తంగా మూడు రౌండ్స్‌లో టీకీకరణ నిర్వహిస్తున్నాం.



- డాక్టర్ పరిమళ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

ఇంటర్వ్యూ..

ఎంపీడబ్ల్యూల వేతనాలు చెల్లించాం

» డీపీఎం నవీద్ అహ్మద్



మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల వేతనాలు వారు బ్యాంకు ఖాతాలో జమచేశాం. వాటిని నేరుగా జీపీల ఖాతాలో జమచేసి, ఎంపీడబ్ల్యూల ఖాతాల్లోకి వేసినట్లు జిల్లా పంచాయతీ కార్యాలయ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) నవీద్ అహ్మద్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఎంపీడబ్ల్యూల పెండింగ్ వేతనాలు ఎంత?

జిల్లాలోని 16 మండలాల్లోని 423 జీపీల్లో 1,416 మంది కార్మికుల వేతనాలు రూ.2.60 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపీడబ్ల్యూల ఖాతాలో పంచాయతీ కార్యదర్శులు జమ చేశారు.

ఎంపీడబ్ల్యూలకు బీమా సౌకర్యం కల్పించడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి?

ఎంపీడబ్ల్యూల వ్యవస్థ రాకముందే గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌వై) జీవన్‌జ్యోతి బీమా యోజన (జేజేబీవై) పథకాల ద్వారా బీమా చేయించడం జరిగింది. కొన్ని జీపీలలో ఎక్కడైనా బీమా పరిధిలోని కార్మికులను గుర్తించి వారికి బీమా చేయించడం జరుగుతుంది.

న్యూస్ బాక్స్

తగ్గిన కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజు రోజుకూ తగ్గుముఖం పడుతోంది. ఆదివారం సాయంత్రం నాటికి 12.5 అడుగుల వద్ద నీటినిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు పర్యవేక్షకుడు కతలయ్య తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా మూడు నెలల నుంచి రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని విడుదల చేయగా, ప్రస్తుతం కోతకు రావడంతో నీటిని నిలిపివేసినట్లు తెలిపారు.

రేపు భూ భారతిపై అవగాహన

మిడ్జిల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీఎస్ గార్డెన్‌లో మంగళవారం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి హాజరవుతారని రైతులు హాజరుకావాలని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

నవాబ్‌పేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ మాజీ అధికార ప్రతినిధి జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల నాయకులు రాంచంద్రయ్య, రుద్రారం డైరెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

జడ్చర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. గ్యాస్ సిలిండర్ లీక్ అయిన సందర్భంలో చేపట్టాల్సిన చర్యలు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఆర్పే విధానం తదితర అంశాలను పట్టణ ప్రజలకు వివరించారు. జడ్చర్ల ఫైర్‌స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేందర్, లీడింగ్ ఫైర్‌మెన్‌లు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాఘవేందర్, డ్రైవర్ ఆపరేటర్స్ సురేశ్, వెంకటేశ్, ఫైర్‌మెన్స్ నవీన్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

మిత్రుడి కుమార్తె పెళ్లికి రూ.50 వేలు అందజేత

కోయిలకొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు మృతి చెందగా.. అతని కుమార్తె వివాహానికి మిత్రులంతా కలిసి రూ.50 వేలు ఆర్థికం సాయం అందజేసి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. గార్లపాడ్ 1993-94 పదో తరగతి విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న గార్లపాడ్ గ్రామానికి చెందిన జయరాజ్ మృతి చెందగా.. మిత్రులంతా కలిసి ఆదివారం జయరాజ్ కుమార్తె వివాహానికి రూ.50 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

భూత్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ మేసేజీలు చూసి సైబర్ నేరగాళ్ల విసిరే వలలో పడి బలికావద్దని, కష్టించి సంపాదించిన సొమ్మును పరుల పాలు చేయద్దు అంటూ.. పద్మావతి బుర్రకథ బృందం వారు ఆలపించిన గానాలు చూపరులను ఆకట్టుకుంది. ఆదివారం భూత్పూర్ సంతలో భారతీయ స్టేట్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన కళాజాత పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలియని ఫోన్ నంబర్ల నుంచి ఫోన్ వస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు. వారికి ఓటీపీలు చెప్పరాదన్నారు. అదే విధంగా ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రమాదమని తెలిసినా..

మారని తీరు

» వరి కల్లాలుగా సర్వీస్ రోడ్లు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అల్లీపూర్, దమాగ్నాపూర్ శివారులో రోడ్డుపైనే ఆరబోసిన ధాన్యం



జానంపేట సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

మూసాపేట / చిన్నచింతకుంట ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పంట చేతికొచ్చింది. ధాన్యం ఆరబెట్టేందుకు ప్రమాదమని తెలిసినా.. రైతులు ఆయా గ్రామాల సమీపంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల బాటపట్టారు. రోడ్డుపై ధాన్యం త్వరగా ఆరబెట్టవచ్చని, వర్షం వచ్చినా.. బురద ఉండదని రైతులు చాలా వరకు జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబెడుతూ కల్లాలుగా వాడుతున్నారు. మూసాపేట మండలం జానంపేట, కొమిరెడ్డిపల్లి సర్వీస్ రోడ్డుపై, చిన్నచింతకుంట మండలం అల్లీపూర్, మద్దూరు, దమాగ్నాపూర్, లాల్‌కోట, వడ్డెమాన్ గ్రామాల పరిధిలో పెద్ద ఎత్తున రైతులు ధాన్యం రోడ్డుమీదే ఆరబోస్తున్నారు. చాలా వరకు ధాన్యం ఆరబోయడంతో ప్రయాణికులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వర్షం వస్తే తడిచిపోకుండా నల్లటి కవర్లు కప్పి ఉంచడంతో రాత్రి వేళ వాహనదారులకు ఆగుపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జానంపేటలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మహబూబ్‌నగర్ ఆదిత్య పాఠశాలలో..

అపూర్వ సమ్మేళనం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆ జ్ఞాపకాలెంతో మధురాతి మధురం.. ఆ రోజులు ఇక రావేమి రా అంటూ 1983 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు వారు చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ.. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో ఆనందంగా గడిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆదిత్య పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం న్యూమోతీనగర్‌లోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మా ఎదుగుదలకు గురువులే కారణమంటూ వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్, రుక్మిణి, లక్ష్మీ మహేందర్, పూర్వ విద్యార్థులు నరేందర్, జగదీశ్వర్, కొండయ్య, వీరేష్, మహ్మద్, ఇంతియాజ్, యాదవ కుమార్, విజయలక్ష్మీ, భార్గవి, యాదయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● మూసాపేట : మండలంలోని జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006-07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు జానకిరాంరెడ్డి, సిద్ధిలింగం, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణయ్య, రవికుమార్, విజయలక్ష్మి, ఉషారాణి, సాజిదాబేగం, అతీయపాతిమా, సురేఖ స్వాగతించి, సన్మానించారు. పూర్వ విద్యార్థులు రమేష్‌గౌడ్, పల్లి పులేందర్, శివరాజ్, కిరణ్, మల్లికార్జున్, మోహన్ కుమార్, ఆనంద్, సాయికృష్ణ, శారద, మమత, దివ్యభారతి, నవనీత, మన్నెమ్మ, సరిత పాల్గొన్నారు. అదే విధంగా అడ్డాకుల మండలం శాఖాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులు శివకుమార్, రాంచంద్రయ్యగౌడ్, అనుపటి రాంచంద్రయ్య, శ్రీధర్, విద్యావతి, లావణ్య, జయన్నగౌడ్, కృష్ణవేణిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌గౌడ్, రాజేష్, నరేందర్ పాల్గొన్నారు.

● కోయిలకొండ : మండలంలోని గార్లపాడ్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠాలు బోధించిన గురువులను పూలమాల, శాలువాతో సత్కరించి, చదువుకొన్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.



గార్లపాడులో..



శాఖాపూర్‌లో..

గాలివాన బీభత్సం

» తడిచిన వరి ధాన్యం » కూలిన రేకుల షెడ్డు



కూలిపడిన రేకులషెడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖర్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఐకేపీ సిబ్బంది

మూసాపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం బలీద్‌పల్లి, కన్మనూర్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా గాలివాన దుమారం తీవ్ర బీభత్సం నెలకొవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. పంట పొలాల్లో ఆరబోసిన ధాన్యం తడిచి పోగా, మరికొన్ని చోట్ల వర్షం నీటి ప్రవాహంలో ధాన్యం కొట్టుకుపోయింది. ఐకేపీ కొనుగోలు కేంద్రాల వారు సైతం సేకరించిన ధాన్యం సుమారు వందలాది బస్తాలు తడిచిపోయింది. బలీద్‌పల్లిలో కోట్ల రాంరెడ్డి అనే రైతుకు సంబంధించిన ఆవుల షెడ్డుపై రేకులు కూలి ఆరు ఆవులు, దూడలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాయి. పొలాల్లో ఉన్న కరెంట్ స్తంభాలు బలమైన గాలికి విరిగిపడి వైర్లు తెగిపడ్డాయి. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమాచారం తెలుసుకున్న అడ్డాకుల తహసీల్దార్ శేఖర్, ఐకేపీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

● జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు వర్షం పడింది. పట్టణంలోని రోడ్లన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. ఈదురుగాలులతో అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

● దేవరకద్ర/మిడ్జిల్/బాలానగర్ : అకాల వర్షానికి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లముందే తడిపిసోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు ఆదివారం ధాన్యం తీసుకరాగా, మార్కెట్‌కు సెలవు కావడంతో ఆరబెట్టుకున్నారు. ఈ క్రమంలో సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. అదే విధంగా మిడ్జిల్ మండల కేంద్రంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి.

పరిహారం అందేనా!

» పంట నష్టపోయిన రైతుల ఎదురు చూపులు



పంటను చూపిస్తున్న రైతు నరసింహారెడ్డి (ఫైల్)

మిడ్జిల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అన్నదాతలు సతమతమవుతున్నారు. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షానికి అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల గ్రామాల్లోని 412 మంది రైతులకు గాను 300 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లగా, 8 మంది రైతులకు చెందిన 8 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 8 ఎకరాల్లో మామిడితోట దెబ్బతింది. వరి సాగుకు రైతులు కూలీల కొరతతో ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. తీరా పంట చేతికందే సమయా నికి వడగళ్ల వర్షం రూపంలో రైతులకు తీరని కన్నీటిని మిగిల్చింది. ఈ క్రమంలో పంట నష్టపోయిన రైతుల ను గుర్తించేందుకు అధికారులు గ్రామాలను సందర్శించి నివేదికలుపై అధికారుల కు సమర్పించారే తప్ప తమకు ప్రభుత్వం నుంచి సాయం అందలేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తొమ్మిది ఎకరాల్లో సాగు చేశా



తొమ్మిది ఎకరాల్లో వరి సాగుచేశా. రెండు, మూడు రోజుల్లో పంట కోతకొచ్చే సమయంలో వడగళ్ల వర్షం తమకు శాపంగా మారింది. పెద్ద మొత్తంలో వడ్లు రాలడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

- నర్సింహ్మారెడ్డి, రైతు, అయ్యవారిపల్లి

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి



అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతుల వివరాలు ఇప్పటికే అధికారులు నివేదికలు పంపినా ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుల సమస్య పట్టనట్లు వ్యవహరిస్తుంది. జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

- పల్లె తిరుపతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు

అధికారులకు నివేదికలు పంపించాం



వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించి జరిగిన నష్టం అంచనా వేసి నివేదికను జిల్లా అధికారులకు అందజేశాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను బట్టి తాము తమ శాఖ ద్వారా చర్యలు చేపడుతాం.

- సిద్ధార్థ, ఏవో, మిడ్జిల్

ఘనంగా ఈస్టర్ వేడుకలు



జడ్చర్లలోని కల్వరికొండపై ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

జడ్చర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజోతి) : ఈస్టర్ పండుగను ఆదివారం జడ్చర్లలో క్రిస్టియన్లు ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణం జయించి తిరిగి లేచిన రోజున ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ సమీపంలోని కల్వరికొండపై సామూహిక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ రాజశేఖర్ ఈస్టర్ సందేశాన్నిచ్చారు. యేసుప్రభువు ఈ లోకానికి వచ్చి మరణించి తిరిగి మూడో రోజు లేచాడని సర్వ మానవాళి కొరకై తాను చూపించిన ప్రేమ, విధేయత, నమ్మకత్వం మనందరికి చూపించారని వివరించారు. కల్వరికొండపై ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపన చేశారు. పాస్టర్ కె.విలియమ్‌బూత్, తిమోతి, జైపాల్, నిత్యానందం, లూథర్, మైఖేల్ మనోహర్, దేవదానం, ఎబినేజర్, ప్రీతమ్, సందీప్, జాన్సన్, టైటస్, మోజెస్, ఆశీర్వాదం, నతానియేల్ పాల్గొన్నారు.

● మిడ్జిల్ : మండలంలోని వెలుగొమ్ముల చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ ఏలియా సందేశం ఇచ్చారు. సంఘ సభ్యులు శంకర్, ఏలియా, లాజర్, శ్రీను, మాణిక్యమ్మ, జ్యోతి, సౌజన్య, మౌనిక, రాజు, ఆదాము, ప్రేమ్‌కుమార్, పద్మ, సారమ్మ, సామెల్, చిన్నయ్య, బాలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు నాయుడి జన్మదినం



గడియారం చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరంలోని గడియారం చౌరస్తాలో టీడీపీ నాయకులు ఆదివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలప్ప, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాలాద్రిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నప్ప, మహబూబ్‌నగర్ పార్లమెంటు అడ్‌హక్ కమిటీ సభ్యులు రాములు యాదవ్, మురళి, శ్రీనివాస్ గౌడ్, తిరుపతయ్య ముదిరాజ్, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సాయన్నగౌడ్ సత్యశీలారెడ్డి, వెంకట రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసింది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలోని నేషన్ ఫంక్షన్ హాల్‌లో బహుజన టీచర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెమాన్ బాలవీర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలపీరు గొప్పవ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఆయన శేష జీవతం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అన్ని కులాల వారు ఒకే దగ్గర చదువుకేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా విద్యా కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై బాలపీరుతో తనకున్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దండోర నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, కావలి కృష్ణ, బాలశంకర్, విజయ్, కావలి రమేష్, చైతన్య, పట్నం చెన్నయ్య, కడెం బాల్‌శంకర్ పాల్గొన్నారు.

రక్తదానం చాలా గొప్పది



రక్తదానం చేస్తున్న స్నేహ ఫామ్స్ డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు

మూసాపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని స్నేహ ఫామ్స్ డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. జాతీయ వలంటీర్ గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అడ్డాకుల సమీపంలోని స్నేహ చికెన్ ఫామ్స్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి రక్తదానం చేసి ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, సమాజంలోని ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకొచిచ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల్ని రక్షించేందుకు రక్తం అత్యవసరమన్నారు. వేసవిలో రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి రక్తదానం చేయాలన్నారు. రక్తదాన శిబిరంలో మొత్తం 57 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. యూత్ రెడ్ క్రాస్ సమన్వయకర్త బాబుల్‌రెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



దుందుభీ వాగులో ఇసుక తీయడంతో ఏర్పడిన గోతులు

మిడ్జిల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రాత్రి వేళ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాగు పరివాహక ప్రాంత రైతులు విమర్శిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున నుంచి ఉదయం 7 గంటల వరకు మిడ్జిల్, మున్ననూర్, వెలుగొమ్ముల గ్రామాల సరిహద్దు ప్రాంతం దుందుభీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించారు. ఈ విషయమై రైతులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించేందుకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని, పోలీసులకు భారీగా ముడుపులు ముట్టజెప్పడంతో అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

సజావుగా ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్‌సీ పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, ఓపెన్ స్కూల్ కో- ఆర్డినేటర్ మద్దూరి శివయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఎస్ఎస్‌సీ పరీక్షలు 4 కేంద్రాల్లో 401 విద్యార్థులకు గాను 351 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు 4 కేంద్రాల్లో 694 మంది విద్యార్థులకు గాను 623 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఎస్ఎస్‌సీ పరీక్షలకు గాను ఓ పరీక్ష కేంద్రంలో ఒక్క విద్యార్థికి పరీక్ష నిర్వహించగా, ఆ ఒక్క విద్యార్థి గైర్హాజరై నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు మూడు కేంద్రాల్లో 27 మంది విద్యార్థులకు నిర్వహించగా, 25 మంది హాజరైనట్లు తెలిపారు.